### ఉచిత సైన్స్ శిక్షణ శిబిరం

నస్పూర్, ఏప్రిల్ 15 : మంచిర్యాలలోని జిల్లా సైన్స్ కేంద్రంలో ఈ నెల 25 నుంచి 12 రోజుల పాటు ఉచిత సైన్స్ శిక్షణ శిబిరం నిర్వహిస్తున్నట్లు డీఈవో యాదయ్య ఒక ప్రకటనలో తెలిపారు. 8,9వ తరగతి ఉత్తీర్ణత సాధించిన విద్యార్థులకు ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 12 గం టల వరకు శిక్షణ శిబిరం ఉంటుందన్నారు. సైన్స్‌తో పాటు కోడింగ్, ఎలక్ట్రానిక్స్‌పై ప్రత్యేక శిక్షణ ఇవ్వనున్నట్లు తెలిపారు. మొత్తం వంద మంది విద్యార్థులకు అవకాశం ఉంటుందని తెలిపారు. వివరాలకు జిల్లా సైన్స్ అధికారి మధుబాబు 9849550200లో సంప్రదించాలన్నారు. విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

### కొనుగోలు కేంద్రాలు సక్రమంగా నిర్వహించాలి

జన్నారం, ఏప్రిల్ 15 : యాసంగిలో కొనుగోలు కేంద్రాలను సక్రమంగా నిర్వహించాలని అడిషనల్ కలెక్టర్ మోతిలాల్ అన్నారు. మంగళవారం మండల కేంద్రంలోని ఐకేపీ కార్యాలయంలో ఐకేపీ, పీఏసీఎస్, వ్యవసాయ అధికారులు, నిర్వాహకులతో నిర్వహించిన సమావేశంలో అడిషనల్ కలెక్టర్ మాట్లాడారు. ప్రభుత్వం సూచిన విధంగా 17 శాతం తేమ ఉన్న వరిధాన్యం కొనుగోలు చేయాలని, తాలు, తప్ప లేకుండా చూసుకోవాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ రాజమనోహర్ రెడ్డి, ఎంపీఎం బుచ్చన్న, నిర్వాహకులు తదితరులు పాల్గొన్నారు.

### అనారోగ్యంతో యువకుడి ఆత్మహత్య

నెన్నెల, ఏప్రిల్ 15: అనారోగ్యంతో బాధపడుతూ యువకుడు చెల్లుబోతు అనిల్ కుమార్(24) మంగళవారం ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. నెన్నెల మండలం జండా వెంకటాపూర్ గ్రామానికి చెందిన అనిల్ కుమార్ మంగళవారం ఉదయం తన ఇంట్లో ఉరేసుకున్నాడు. 'నన్ను క్షమించండి, అమ్మనాన్న. నాకు ఆరోగ్యం బాగా లేదు. చాలా రోజులు నుంచి ఆరోగ్యం మంచిగా లేదు అది భరించలేక నేను చని పోతున్నాను. నా చావుకు ఎవరూ కారణం కాదు, నా సొంత నిర్ణయంతో చనిపోతున్నాను. అన్నయ్య సారీ ఈ లెటర్ చదివే సమయానికి నేను నీతో ఉండను, నా వల్ల మీరు చాలా బాధపడ్డారు. అమ్మానాన్నలను బాగా చూసుకో ఒక సెలవు' అంటూ లేటర్ రాసి పెట్టాడు. అనిల్ తండ్రి సత్తయ్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ ప్రసాద్ తెలిపారు.

### బీసీ కులగణన కోసం పాదయాత్ర

మంచిర్యాల (ఏసీసీ), ఏప్రిల్ 15: కేంద్ర ప్రభుత్వం జనగణనలో భాగంగా కులగణన చేపట్టాలని బీసీ జనాభాను నిర్ధారించాలని డిమాండ్ చేస్తూ జాతీయ బీసీ హక్కుల పోరాట సమితి నేతలు బుధవారం పాదయాత్ర చేపట్టనున్నారు. దీనికి సంబంధించిన కరపత్రాలను మంగళవారం పంచి పెట్టారు. జిల్లా కేంద్రంలోని అంబేద్కర్ చౌరస్తా నుంచి హాజీపూర్ వరకు ఈ యాత్ర సాగుతుందని, బీసీ ప్రజలంతా పెద్దసంఖ్యలో హాజరు కావాలని సూచించారు. బీసీ కులగణనకు 27 రాజకీయ పార్టీలు అనుకూలంగా ఉన్నాయని, పది రాష్ట్ర ప్రభుత్వాలు అసెంబ్లీలో తీ ర్మానం చేసి పంపించాయని, అయినప్పటికీ కేంద్రం పట్టించుకోవడం లేదని విమర్శించారు. రాబోయే జనగణనలో కులగణన చేసి, బీసీలకు రావాల్సిన న్యాయమైన వాటాను ఇవ్వాలని కేంద్రాన్ని డిమాండ్ చేశారు. ఇక్కడ గుమ్ముల శ్రీనివాస్, శాఖపూరి భీంసేన్ తదితరులు పాల్గొన్నారు.

### ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణ పనులను వేగవంతం చేయాలి

ఆసిఫాబాద్ అంబేద్కర్ చౌక్, ఏప్రిల్ 15: నిరుపేదలకు గూడు కల్పించాలని ఉద్దేశంతో ప్ర భుత్వం చేపట్టిన ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణ పనులను వేగవంతం చేయాలని కలెక్టర్ వెంకటేశ్ ధోత్రే పేర్కొన్నారు. మంగళవారం జిల్లా కేంద్రంలోని కలెక్టరేట్‌లో జిల్లా అదనపు కలెక్టర్లు దీపక్ తివారి, ఎం డేవిడ్, కాగజ్‌నగర్ సబ్ కలెక్టర్ శ్రద్ధ శుక్లా, ఆసిఫాబాద్ ఆర్డీవో లోకేశ్వరరావుతో కలిసి అధికారులతో ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణం, అర్హుల జాబితా ఎంపిక, తాగునీటి సరఫరా అంశాలపై సమీక్ష సమావేశం నిర్వహించారు.

### కొత్త రేషన్ కార్డుల కోసం వివరాల సేకరణ

మంచిర్యాల (ఏసీసీ), ఏప్రిల్ 15: రేషన్ కార్డుల వివరాలు నమోదు కార్యక్రమం జరుగుతోంది. మంగళవారం జిల్లా కేంద్రంలోని స్వప్న రేషన్ షాప్ వద్ద మున్సిపల్ వార్డు ఆఫీసర్ శివకృష్ణ లబ్ధిదారుల నుంచి వివరాలు సేకరించారు. కొత్తగా రేషన్ కార్డు కోసం దరఖాస్తు చేసుకున్న వారికి ఫోన్ చేసి, వారి ఆధార్‌కార్డులు, గ్యాస్ వివరాలను తన ఫోన్ ద్వారా ఆన్‌లైన్‌లోకి ఎక్కించారు. ఈ సందర్భంగా అక్కడికి వచ్చిన నూతన లబ్ధిదారులు తమకు రేషన్ కార్డు ఎప్పుడు వస్తుందని ఆడిగారు. మరికొంతకాలం ఈ వివరాలు నమోదు చేయడం జరుగుతుందని, ఎప్పుడు రేషన్ కార్డులు ఇచ్చేది తమకు తెలియదని శివకృష్ణ తెలిపారు. ఇప్పటికే సన్నబియ్యం పంపిణీ చేస్తుండడంతో తమకు త్వరగా రేషన్ కార్డులు మంజూరు చేయాలని లబ్ధిదారులు కోరుతున్నారు.

**PUBLIC NOTICE**

My client by name **Boddu Sandeep Kumar,** S/o. Shankar, aged: 33 Yrs.Occ: SCCL Employee, R/o. H. No. 1-12, Thallapalli, Naspur, Dist: Mancherial, has lost his original link document Registered Sale Deed Doct. No. **910/2014, Dt. 04-02-2014,** which were registered before SRO Mancherial, while shifting his house from Mancherial to Naspur, he lost that original link document, he tried to trace out the same but in vain. If any one finds the above said document, they shall have handover the same to me. He approaches Bank of Baroda, Mancherial Branch for obtaining loan and also anyone is having any objections about the property covered under Register Sale Deed inform to the below address within one week from the date of publication otherwise the Bank will proceed further.

Yours sincerely

Sd/- **N. KAMALA MANOHAR RAO**
Advocate
4-197, Near LIC Office, Mancherial.

## కావర కొత్తపల్లిలో తాగునీటికి ఇబ్బందులు



ట్యాంకర్ నీటిని పట్టుకొంటున్న గ్రామస్తులు

కోటపల్లి, ఏప్రిల్ 15 : కోటపల్లి మండలంలోని రాజారం గ్రామ పంచాయతీ పరిధిలోని కావర కొత్తపల్లి గ్రామంలో తీవ్ర తాగునీటి సమస్య నెలకొంది. గ్రామానికి నీటిని సరఫరా చేసే బోరుబావి విద్యుత్ మోటర్ చెడిపోవడం, మిషన్ భగీరథ నీరు సరఫరా కాకపోతుండడంతో గ్రామస్తులు నీటి కోసం నానా కష్టాలు పడుతున్నారు. వారం రోజులుగా గ్రామస్తులు తాగునీటికి ఇబ్బందులు పడుడుతున్నా పట్టించుకునే నాథుడు కరువయ్యారని గ్రామస్తులు అంటున్నారు. గ్రామానికి దూరంలో ఉన్న వ్యవసాయ బోరుబావుల నుంచి నీటికి తెచ్చుకుంటున్నామని వాపోతున్నారు. తీవ్ర నీటి ఎద్దడి నెలకొనడంతో గ్రామ పంచాయతీ ట్యాంకర్ ద్వారా నీటిని సరఫరా చేస్తుండగా, ఈ నీటితోనే గ్రామస్తులు సరిపెట్టుకుంటున్నారు. సంబంధిత అధికారులు స్పందించి కావర కొత్తపల్లి గ్రామంలో తాగునీటి సమస్యను తీర్చాలని గ్రామస్తులు కోరుతున్నారు.

## ఉత్సాహంగా వార్షికోత్సవం



నృత్యం చేస్తున్న విద్యార్థులు

జన్నారం, ఏప్రిల్ 15 : మండల కేంద్రంలోని ఏఆర్ఎస్, వికాస్ డిగ్రీ కళాశాల వార్షికోత్సవం ఉత్సాహంగా సాగింది. ఈ సందర్భంగా ఒక ఫంక్షన్ హాల్‌లో నిర్వహించి కార్యక్రమంలో విద్యార్థులు వివిధ పాటలపైన చేసిన నృత్యాలు ఆకట్టుకున్నాయి. ఈ కార్యక్రమానికి ఏఆర్ఎస్, వికాస్ కళాశాల వ్యవస్థాపకుడు శ్యాంనాయక్, పెంబి శంకర్, ఎంకన్న, ప్రిన్సిపాల్ ముత్యం సతీశ్, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

## ఆదివాసీ యువ నేతకు నివాళి



వెడ్మ కిషన్ చిత్రపటానికి పూలమాల వేస్తున్న మాజీ ఎమ్మెల్యే దుర్గం చిన్నయ్య

కాసిపేట, ఏప్రిల్ 15 : ఆదివాసీ యువ నేత వెడ్మ కిషన్ ఇటీవల విద్యుత్ షాక్‌తో మృతి చెందగా, మంగళవారం బెల్లంపల్లి మాజీ ఎమ్మెల్యే దుర్గం చిన్నయ్య ఘనంగా నివాళులర్పించారు. కాసిపేటలోని వెడ్మ కిషన్ ఇంటికెళ్లి ఆయన చిత్రపటానికి పూలమాలలు వేశారు. ఆయన కుటుంబ సభ్యులను పరామర్శించి సంతాపం తెలిపారు. ఆదివాసీ సంఘం యువ నేతగా వెడ్మ కిషన్ అందించిన సేవలు మరవలేనివన్నారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు బొల్లు రమణారెడ్డి, మాజీ జడ్పీటీసీ పల్లె చంద్రయ్య, మాజీ ఎంపీటీసీ కొండబత్తుల రాంచందర్, మాజీ ఉప సర్పంచ్ బోయిని తిరుపతి, మోటూరి వేణు, రాంటెంకి వాస్‌దేవ్, ఆదివాసీ సంఘాల నాయకులు పెంద్రం హన్మంతు, ఆడె జంగు, మడావి అనంతరావు, ఆత్రం జంగు పాల్గొన్నారు.


## పెండింగ్ వేతనాలు చెల్లించాలని నిరసన



కలెక్టర్ కార్యాలయం ఎదుట నిరసన తెలుపుతున్న ఐఎఫ్‌టీయూ రాష్ట్ర నాయకుడు బ్రహ్మానందం, బీసీ హాస్టళ్ల కార్మికులు

ఆసిఫాబాద్ టౌన్, ఏప్రిల్ 15 : జిల్లాలోని బీసీ హాస్టళ్లలో పనిచేస్తున్న కాంట్రాక్ట్, ఔట్ సోర్సింగ్ కార్మికుల 12 నెలల పెండింగ్ వేతనాలు వెంటనే చెల్లించాలని ఐఎఫ్‌టీయూ రాష్ట్ర నాయకుడు బ్ర హ్మానందం డిమాండ్ చేశారు. మంగళవారం స్థానిక కలెక్టరేట్ ఎదుట కార్మికులతో కలిసి నిరసన వ్యక్తం చేశారు. అనంతరం కలెక్టర్ వెంకటేశ్‌ధోత్రేకు వినతిపత్రం అందజేశారు. బ్రహ్మానందం మాట్లాడుతూ కేవలం రూ. 13,600లతో పనిచేస్తున్న కాంట్రాక్ట్, ఔట్ సోర్సింగ్ వర్కర్స్‌కు ప్రతినెలా వేతనాలు చెల్లించకపోవడం బాధాకరమన్నారు. ఈఎస్ఐ ఈపీఎఫ్ ప్రతినెలా చెల్లించడం లేదన్నారు. ఇప్పటికైనా వెంటనే వేతనాలు విడుదల చేయాలని, లేదంటే నిరవధిక సమ్మెకు పిలుపునివ్వాల్సి వస్తుందని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో పీడీఎస్‌యూ జిల్లా ప్రధాన కార్యదర్శి జగజంపుల తిరుపతి, బీసీ హాస్టల్ వర్కర్స్ యూనియన్ నాయకులు కొమురయ్య, లక్ష్మి, శారద, పార్వతి, శకుంతల, పోషక్క, సరోజ, జ్యోతి, సుజాత పాల్గొన్నారు.

### గుడుంబా విక్రయించవద్దు



గుడుంబా విక్రయించవద్దని మహిళకు పుష్పగుచ్ఛం అందజేస్తున్న ఎస్ఐ

వేమనపల్లి, ఏప్రిల్ 15 : గ్రామాల్లో ఎవరూ కూడా గుడుంబా విక్రయించవద్దని, తయారు చేయవద్దని నీల్వాయి ఎస్ఐ శ్యామ్ పటేల్ హెచ్చరించారు. మంగళవారం మండలంలోని మామిడిపల్లి గ్రామంలో గుడుంబా విక్రయిస్తున్న చిడం సమ్మక్క, కొర్తె చంద్రక్కకు పుష్పగుచ్ఛాలు అందించి కౌన్సెలింగ్ నిర్వహించారు. అనంతరం గ్రామంలో యువకులతో కలిసి గుడుంబా నిర్మూలనపై ర్యాలీ నిర్వహించారు.

## చెస్ అసోసియేషన్ జిల్లా కమిటీ ఎన్నిక




నూతన కార్యవర్గ సభ్యులతో చెస్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షురాలు లక్ష్మీరెడ్డి

మందమర్రి, ఏప్రిల్ 15: తెలంగాణ చెస్ అసోసియేషన్ జిల్లా నూతన కమిటీని మంగళవారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు అసోసియేషన్ జిల్లా అభివృద్ధి చైర్మన్ ఈగ కనకయ్య, గౌరవాధ్యక్షుడు ఎండీ సిరాజ్ ఉర్ రహమాన్ తెలిపారు. నూతన కమిటీ జిల్లా అధ్యక్షుడిగా దామెర్ల సిద్దయ్య, ఉపాధ్యక్షులుగా ఆర్.విష్ణువర్ధన్, డింగిరి కృష్ణకాంతాచారి, ప్రధాన కార్యదర్శిగా ఈగ అన్వేశ్, అదనపు కార్యదర్శిగా లక్ష్మినారాయణ, కోశాధికారిగా సమ్మిరెడ్డి, సంయుక్త కార్యదర్శులుగా సుజన్ రెడ్డి, కుమార్, విజయ్‌కుమార్, ఆర్గనైజింగ్ కార్యదర్శిగా చేదం అనూష, కార్యనిర్వాహకులుగా కొప్పుల సత్తయ్య, కాసర్ల తిరుపతి, జనగామ సతీశ్ కుమార్ ఎన్నికయ్యారని తెలిపారు.

# అలరించిన శతావధానం

- ఎంవీ పట్వర్ధన్‌కు ప్రముఖుల ప్రశంసలు
- 'శతావధాన ద్యుమణి' బిరుదుతో సత్కారం



శతావధాని ఎంవీ పట్వర్ధన్ స్వరూపారాణి దంపతులను సన్మానిస్తున్న కవులు, పండితులు, నిర్వాహకులు

చెన్నూర్ టౌన్, ఏప్రిల్ 15 : చెన్నూర్ పట్టణానికి చెందిన మారేపల్లి వెంకటరమణ పట్వర్ధన్ శతావధానంతో ఆహూతులను ఆకట్టుకున్నారు. భాగ్యనగరంలో ఈనెల 12, 13, 14 తేదీల్లో మూడు రోజులపాటు అద్భుతంగా కొనసాగింది. సోమవారం రాత్రి వరకు కొనసాగిన ఈ అవధానంలో 108 మంది సమస్య, దత్తపది, వర్ణన, న్యస్తాక్షరి, నిషిద్ధాక్షరి, ఆశువు అంశాల ప్రశ్నలకు అవధాని దీటుగా పద్యాలను అప్పజెప్పారు. సోమవారం చివరగా మిగిలిన వర్ణన, న్యస్తాక్షరి, ఆశువు అంశాల పూరణలు అవధాని పూర్తి చేశారు. మధ్యాహ్నం ధారణ సభ ప్రారంభించారు. అవధాని 75 పద్యాలను ధారణ చేసి సాహితీ రసజ్ఞులను అబ్బురపరిచి ఆనందింపజేశారు. ఈ సభకు డా.మల్లాప్రగడ శ్రీమన్నారాయణ మూర్తి అధ్యక్షత వహించారు. విజయోత్సవ సభ నేత్రపర్వంగా సాగింది. పట్వర్ధన్‌ను కవులు, పండితులు, అతిథులు ప్రశంసించారు. ముఖ్య అతిథిగా రిటైర్డ్ న్యాయమూర్తి దుర్గాప్రసాద్ రావు, సభాధ్యక్షుడిగా ఆచార్య ఎల్లూరి శివారెడ్డి వ్యవహరించారు. విశిష్ట అతిథులుగా శాసనసభ్యుడు కసిరెడ్డి నారాయణ రెడ్డి, తెలుగు విశ్వవిద్యాలయం వైస్ చాన్స్‌లర్ ఆచార్య వెలుదండ నిత్యానందం, బీజేపీ నాయకురాలు కొత్తూరు గీతామూర్తి, ఆచార్య కోట్ల హనుమంతరావు, వనం జ్వాలా నరసింహారావు పాల్గొన్నారు. శతావధాని పట్వర్ధన్‌ను దుశ్శాలువా, గజమాల, పట్టువస్త్రాలు, జ్ఞాపిక, పారితోషికంతో ఘనంగా సన్మానించారు. 'శతావధాన ద్యుమణి' బిరుదుతో సత్కరించారు. శతావధానం అద్భుత నిర్వహణకు అవధాన నిర్వహణ కమిటీ గౌరవాధ్యక్షుడు డా.కేవీ రమణాచారి, అధ్యక్షుడు నారుమంచి వేంకట అనంత కృష్ణ, కార్యదర్శి మరుమాముల వెంకటరమణ శర్మ, కోశాధికారి కేవీఎన్ ఆచార్య, సభ్యులు భీంసేన్ మూర్తి, అవుసుల భానుప్రకాశ్, దుగ్గిరాల వాసుదేవరావు, ఓం ప్రకాశ్, లక్ష్మీ మానస, మంచినీళ్ల సరస్వతి రామశర్మ, స్వా ప్రసాదం, అరవల్లి శ్రీదేవి, తదితరులు కృషి చేశారు.

### రైల్వే పై ఓవర్ బ్రిడ్జి ప్రారంభం

రామకృష్ణాపూర్, ఏప్రిల్ 15: క్యాతనపల్లి రైల్వే ఫ్లైఓవర్ బ్రిడ్జిని మంగళవారం చెన్నూరు గడ్డం వివేక్ వెంకటస్వామి, పెద్దపల్లి ఎంపీ గడ్డం వంశీకృష్ణ ముఖ్యఅతిథులుగా హాజరై లాంఛనంగా ప్రారంభించారు. ముందుగా రైల్వే బ్రిడ్జి శిలాఫలకంను ఆవిష్కరించారు. అనంతరం బిడ్జికి కట్టిన రిబ్బన్‌ను కట్ చేసి ఎమ్మెల్యే వివేక్, ఎంపీ వంశీకృష్ణలు అధికారికంగా ప్రారంభించారు. అనంతరం అక్కడే ఏర్పాటు చేసిన సమావేశంలో మంచిర్యాల కలెక్టర్ కుమార్ దీపక్‌తో కలిసి ఎంపీ, ఎమ్మెల్యేలు ప్రజలను ఉద్దేశించి ప్రసంగించారు. ఇక్కడ క్యాతనపల్లి మున్సిపల్ కమిషనర్ గద్దె రాజు, ఆర్అండ్‌బి అధికారులు, నాయకులు పాల్గొన్నారు.

### సౌకర్యాలు కల్పించాలి

కాగజ్‌నగర్, ఏప్రిల్ 15: కాగజ్‌నగర్ పట్టణంలోని ఎల్లాగౌడ్ తోటలోని ఈ సేవా కేంద్రంలో సౌకర్యాలు కల్పించాలని సీనియర్ సిటిజన్ అసోసియేషన్ రాష్ట్ర కార్యదర్శి మార్త సత్యనారాయణ మంగళవారం ఒక ప్రకటనలో కోరారు. ఈ సేవ కేంద్రంలో మంచినీరు, కూలర్‌ను ఏర్పాటు చేయాలని కోరారు. సౌకర్యాల లేమితో వినియోగదారులు ఇబ్బందులు పడుతున్నారన్నారు. అధికారులు స్పందించి సౌకర్యాలు కల్పించాలని పేర్కొన్నారు.

### ప్రజల భద్రత కోసమే కమ్యూనిటీ పోలీసింగ్

శ్రీరాంపూర్, ఏప్రిల్ 15: ప్రజల భద్రత కోసమే కమ్యూనిటీ పోలీసింగ్ కార్యక్రమాలను నిర్వహిస్తున్నామని శ్రీరాంపూర్ సీఐ వేణుచందర్ తెలిపారు. మంగళవారం శ్రీరాంపూర్ పోలీస్ స్టేషన్ పరిధిలో కమ్యూనిటీ పోలీసింగ్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన సైబర్ నేరాలు, సీసీటీవీ కెమెరాల ఏర్పాటు అంశాలపై ప్రజలకు అవగాహన కల్పించారు. నేరాల నియంత్రణకు సీసీ కెమెరాలు ఎంతో ఉపయోగపడుతాయన్నారు. ఇక్కడ ఎస్ఐ సంతోష్, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

### పరామర్శ

కాసిపేట, ఏప్రిల్ 15 : మండలంలోని పలు కుటుంబాలను తెలంగాణ గిరిజన ఆర్థికాభివృద్ధి కార్పొరేషన్ చైర్మన్ కొట్నాక తిరుపతి పరామర్శించారు. కుర్రేఘడ్ గ్రామానికి చెందిన కుర్సెంగ భూదే షా స్వామి తల్లి మృతి చెందగా వారి కుటుంబాన్ని పరామర్శించారు. అనంతరం పల్లంగూడ గ్రామానికి చెందిన వెడ్మ కిషన్ ఇటీవల విద్యుత్ షాక్‌తో మృతి చెందగా వారి కుటుంబాన్ని పరామర్శించారు. కార్యక్రమంలో జిల్లా కోఆర్డినేటర్ వేముల కృష్ణ, మాజీ ఎంపీటీసీలు మడావి భీమరావు, పార్వతి మల్లేశ్, ఆదివాసీ సేనా మండలాధ్యక్షుడు మడావి వెంకటేశ్, మడావి గంగారం, పెంద్రం శంకర్, ఆత్రం సంజీవ్, పెంద్రం తిరుపతి, సజ్జనపు చారి, నేరెళ్ల రవి ఉన్నారు.

### దాడి చేసిన ఒకరిపై కేసు

దండెపల్లి, ఏప్రిల్ 15: దాడికి పాల్పడిన వ్యక్తిపై కేసు నమోదు చేసినట్లు దండెపల్లి ఎస్ఐ తహెసీనుద్దీన్ తెలిపారు. మంగళవారం ఆయన తెలిపిన వివరాల ప్రకారం, మండలంలోని కాసిపేట గ్రామానికి చెందిన లక్కాకుల శృజన్‌ను అదే గ్రామానికి చెందిన కళ్లెం సంతోష్ కర్రతో దాడి చేయడంతో అతని తలకు తీవ్రగాయాలయ్యాయని పేర్కొన్నారు. ఇద్దరి మధ్య మొరానికి సంబంధించిన డబ్బుల విషయంలో గొడవ జరిగిందన్నారు. సంతోష్ తండ్రి కల్లెం శంకరయ్య ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

### తవ్వకం పనుల పరిశీలన

రెబ్బెన, ఏప్రిల్ 15: బెల్లంపల్లి ఏరియాలోని గోలేటి గ్రామ శివారులోని పంట పొలాల వద్ద చేస్తున్న పనులు, కుంటల తవ్వకం పనులు బెల్లంపల్లి ఏరియా జీఎం విజయభాస్కర్‌రెడ్డి ఆధ్వర్యంలో మంగళవారం కార్పొరేట్ జీఎం (సివిల్) సూర్యనారాయణ, జీఎం (ఎన్విరాన్‌మెంట్) సైదులు పరిశీలించారని బెల్లంపల్లి ఏరియా పర్సనల్ మేనేజర్ రెడ్డిమల్ల తిరుపతి తెలిపారు. కార్యక్రమంలో బెల్లంపల్లి ఏరియా జీఎం విజయభాస్కర్‌రెడ్డి, డీజీఎం(సివిల్) మదీనా బాషా, ఎన్విరాన్‌మెంట్ అధికారి హరీశ్, ఏరియా ఎస్టేట్ అధికారి సాగర్, ఈఈ(సివిల్) మనోజ్‌తోపాటు తదితరులున్నారు.

## గుండెపోటుతో సింగరేణి అధికారి మృతి



చిరంజీవులు (ఫైల్)

సీసీసీ నస్పూర్, ఏప్రిల్ 15: శ్రీరాంపూర్ ఏరియా ఐఈడీ డీజీఎంగా పనిచేస్తున్న చిరంజీవులు (57) గుండెపోటుతో మృతి చెందాడు. సోమవారం జీఎం కార్యాలయంలో జరిగిన అంబేద్కర్ జయంతి వేడుకల్లో ఆయన ఉత్సాహంగా పాల్గొన్నారు. సాయంత్రం సీసీసీలోని ఆఫీసర్ క్లబ్‌లో షటిల్ గేమ్ ఆడడానికి వెళ్లాడు. ఆట ముగిసిన తర్వాత రాత్రి ఇంటికి వచ్చి స్నానం చేసిన తర్వాత భోజనం చేశాడు. అనంతరం ఆయన గుండెపోటుకు గురై శరీరం మొత్తం ఒక్కసారిగా చమటలు పట్టి కుప్పకూలిపోయాడు. భార్య ఆందోళనకు గురై ఇరుగుపొరుగు వారికి సమాచారం అందించడంతో ఆయనను రామకృష్ణాపూర్ సింగరేణి ఏరియా దవాఖానకు తరలించారు. అప్పటికే ఆయన మృతి చెందాడు. పోస్టుమార్టం నిమిత్తం మంగళవారం ఉదయం ఆయన మృతదేహాన్ని మంచిర్యాల ప్రభుత్వ హాస్పిటల్‌కు తరలించారు. జీఎం శ్రీనివాస్, శ్రీరాంపూర్ ఏరియాతోపాటు సింగరేణిలోని వివిధ ఏరియాలకు చెందిన అధికారులు దవాఖాన వద్దకు చేరుకుని ఆయన కుటుంబ సభ్యులను పరామర్శించి, ప్రగాఢ సానుభూతి, సంతాపం ప్రకటించారు. సింగరేణి అధికారులు ఆయనతో ఉన్న అనుబంధాన్ని గుర్తుచేసుకున్నారు. మంచి అధికారిని కోల్పోవడం బాధాకరమని శ్రీరాంపూర్ జీఎం మునిగంటి శ్రీనివాస్ పేర్కొన్నారు. చిరంజీవులుకు భార్య జ్యోతి, ఇద్దరు కొడుకులు వినీత్, రోహిత్ ఉన్నారు.

## ప్రమాదం కేసులో ఒకరికి 18 నెలల జైలు

శ్రీరాంపూర్, ఏప్రిల్ 15: శ్రీరాంపూర్ పోలీస్ స్టేషన్ పరిధిలో జరిగిన రోడ్డు ప్రమాదం కేసులో నిందితుడికి కోర్టు 18 నెలల జైలు శిక్షతోపాటు రూ.8వేల జరిమానా విధించిందని ఎస్ఐ సంతోష్ తెలిపారు. పోతనవేణి మల్లమ్మ(70) 2017 నవంబర్ 6న చెన్నూర్ నుంచి ఆర్టీసీ బస్సులో వచ్చి శ్రీరాంపూర్‌లో దిగింది. గోదావరిఖనికి వెళ్లడానికి రోడ్డు దాటుతుండగా మల్లమ్మను బస్సు ఢీకొట్టడంతో ఆమె రెండు కాళ్లకు తీవ్ర గాయాలయ్యాయి. ఆమె దవాఖానలో చికిత్స పొందుతూ మృతి చెందింది. మల్లమ్మ బంధువు సతీశ్ ఫిర్యాదు మేరకు అప్పటి ఎస్ఐ రవిప్రసాద్, బస్సు డ్రైవర్ ఆవిడపు సంతోష్‌కుమార్‌పై కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టి, నిందితున్ని రిమాండ్‌కు తరలించారు. 13మంది సాక్షులను విచారించి నిందితుడిపై చార్జిషీట్ ఫైల్ చేశారు. సాక్షులను విచారించిన ఎక్సైజ్ స్పెషల్ జ్యుడీషియల్ న్యాయమూర్తి, నిందితుడు ఆవిడపు సంతోష్‌కుమార్ 18నెలల జైలు శిక్ష, రూ.8వేల జరిమానా విధించినట్లు శ్రీరాంపూర్ ఎస్ఐ సంతోష్ వివరించారు. నేరాన్ని రుజువు చేయడానికి న్యాయస్థానంలో పబ్లిక్ ప్రాసిక్యూటర్ అజయ్‌కుమార్ 12మంది సాక్షులను ప్రవేశపెట్టి వాదనలు వినిపించి నిందితుడికి శిక్ష పడడంలో కీలకపాత్ర పోషించినట్లు తెలిపారు. సాక్షులను ప్రవేశ పెట్టడంతో కోర్టు డ్యూటీ ఆఫీసర్ శేఖర్, ఆయనతోపాటు లైజనింగ్ అధికారి వెంకటేశ్వర్లు సహకారం అందించారని తెలిపారు.

### ఒకరికి ఆరు నెలల జైలు, జరిమానా

మంచిర్యాల అర్బన్, ఏప్రిల్ 15: రోడ్డు ప్రమాదం కేసులో ఓ వ్యక్తికి ఆరు నెలల జైలు శిక్ష, రూ.5వేల జరిమానాతో పాటు కారు ఇన్సూరెన్స్ పాలసీ లేనందున రూ.2వేల జరిమానా విధించినట్లు మంచిర్యాల మొదటి అదనపు జ్యుడీషియల్ ఫస్ట్‌క్లాస్ మెజిస్ట్రేట్ న్యాయమూర్తి ఉషనిషద్వాని తీర్పునిచ్చినట్లు సీసీసీ నస్పూర్ ఎస్ఐ సుగుణాకర్ తెలిపారు. మంగళవారం వారు తెలిపిన వివరాల ప్రకారం, 2018 ఫిబ్రవరిలో సీసీసీ సీతారాంపల్లెకు చెందిన కొమ్మా భీమయ్య తన బైక్‌పై కుటుంబంతో వెళ్తుండగా తిరుమల టాకీస్ వద్ద బెల్లంపల్లికి చెందిన అడిగొప్పుల క్రాంతి కుమార్ కారును అతి వేగంగా నడుపుతూ వచ్చి వారి బైకును ఢీకొట్టాడు. ఈ ప్రమాదంలో కొమ్ము భీమయ్య కుటుంబ సభ్యులతోపాటు మరో బైక్‌పై వెళ్తున్న బెక్కం మహేశ్, కలగేర రాజం అనే వ్యక్తులకు గాయాలైనట్లు తెలిపారు. బాధితులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకున్నారు. పబ్లిక్ ప్రాసిక్యూటర్ నంది రవీందర్ కోర్టు కానిస్టేబుల్ నాగరాజు ద్వారా సాక్షులను ప్రవేశపెట్టి వాదనలు వినిపించగా నేరం రుజువుకావడంతో న్యాయమూర్తి తీర్పునుచ్చినట్లు ఎస్ఐ వెల్లడించారు.

### ఆస్తి నష్టంపై ఇద్దరికి ఆరు నెలల సాధారణ జైలు

మంచిర్యాల అర్బన్, ఏప్రిల్ 15: ఆస్తిని నష్టపరిచినందుకు ఇద్దరికి మంచిర్యాల సెంకండ్ అడిషనల్ జ్యుడీషియల్ ఫస్ట్‌క్లాస్ మెజిస్ట్రేట్ కే నిరోష ఆరు నెలల సాధారణ శిక్షతోపాటు, రూ.రెండు వేల జరిమాన విధించినట్లు మంచిర్యాల పట్టణ ఎస్ఐ ప్రమోద్ కుమార్ తెలిపారు. మంగళవారం వారు తెలిసిన వివరాల ప్రకారం, పట్టణంలోని మారుతి నగర్‌లోగల సాగర్‌రావుకు అపార్ట్‌మెంట్‌తోపాటు కొన్ని నివాస స్థలాలున్నాయి. ఆ కాలనీలో అపార్ట్‌మెంట్‌కు, నివాస స్థలాలకు హద్దులు ప్రహరీ గోడలు నిర్మించుకొని గేట్లు పెట్టుకున్నారు. కాగా 1 జూన్ 2020న జైపూర్‌కు చెందిన ఎలక్ట్రికల్ ఏఈ సదానందం గౌడ్, మంచిర్యాలకు చెందిన వ్యాపారి బెజ్జూరి సురేశ్ ఆ వీధిలోకి ప్రవేశించి జేసీబీతో ప్రహరీ గోడలు, గేట్లను, పైప్‌లైన్లను ధ్వంసం చేసినట్లు, దీంతో అక్కడి నివాసితులు వారిని అడ్డుకోగా మాకు మున్సిపల్ అనుమతితో ఉందని కూల్చివేస్తున్నట్లు చెప్పారు. కాగా వారికి ఎలాంటి అనుమతులు లేవని ఉద్దేశపూర్వకంగానే ధ్వంసం చేసినట్లు తెలియగా వారు చేసిన తప్పును ఒప్పుకొని కూల్చిన వాటిని మళ్లీ నిర్మించి ఇస్తామని చెప్పి అడిగినప్పుడల్లా రేపు మాపు అంటూ మాట దాటవేశారాన్నరు. దీంతో వారిపై చర్యలు తీసుకోవాలని 16 జూన్ 2020న మారుతీనగర్‌కు చెందిన లక్సెట్టి మల్లయ్య మంచిర్యాల పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు చేయగా అప్పటి ఎస్ఐ మారుతి కేసు నమోదు చేసుకున్నారు. కేసు కోర్టులో విచారణ అనంతరం పబ్లిక్ ప్రాసిక్యూటర్ ఎన్.రవీందర్, కోర్టు కానిస్టేబుల్ శ్రీనివాస్ సాక్షులను కోర్టులో ప్రవేశపెట్టి విచారించారు. అనంత రం నేరం రుజువు కావడంతో న్యాయమూర్తి ఇద్దరికి శిక్షను విధించినట్లు సీఐ తెలిపారు.

## అగ్ని ప్రమాదాల నివారణపై అవగాహన

జన్నారం, ఏప్రిల్ 15 : అగ్ని ప్రమాదాల వారోత్సవాల్లో భాగంగా మండల కేంద్రంలోని బస్టాండ్‌లో వివిధ వ్యాపార దుకాణాల్లో ఫైర్ ఆఫీసర్ శ్రీనివాస్ ఆధ్వర్యంలో అగ్ని ప్రమాదాల నివారణపై అవగాహన కల్పించారు. అగ్ని ప్రమాదాలపై తీసుకోవాల్సిన ముందు జాగ్రత్తలపై, ప్రమాదాలు జరిగినపుడు వాటిని ఎలా నివారించాలనే దానిపై ప్రజలకు వివరించారు. ఇక్కడ ఫైర్ స్టేషన్ సిబ్బంది ఉన్నారు.

### యూడైస్ సర్వే ప్రారంభం

కాగజ్‌నగర్, ఏప్రిల్ 15: కాగజ్‌నగర్ మండలంలో యూడైస్ ప్లేస్ థర్డ్ పార్టీ ఆసిఫాబాద్ బీఈడీ కళాశాల ట్రెయినీ టీచర్స్‌తో సర్వే ప్రారంభించినట్లు ఎంఈవో ప్రభాకర్ మంగళవారం తెలిపారు. మండలంలోని ఎంపిక చేసిన 94 పాఠశాలలను 9 రూట్లుగా విభజించి 9 మంది ట్రెయినీ ఉపాధ్యాయులతో పాటు, క్లస్టర్ రిసోర్స్ పర్సన్లతో కలిపి టీంలు తయారు చేశామన్నారు. ఈ నెల 21వ తేది వరకు పాఠశాలల భౌతిక వివరాలు పరిశీలన చేసి నివేదికలు సమర్పిస్తారని తెలిపారు. ఆయా పాఠశాలల ప్రధానోపాధ్యాయులు యూడైస్ ప్లేస్‌లో ఆన్‌లైన్‌లో నమోదు చేసిన పాఠశాల వివరాలు భౌతికంగా పరిశీలన చేసి ఏమైనా పొరపాట్లుంటే అప్పటికప్పుడు సరిచేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో జిల్లా ప్లానింగ్ కో ఆర్డినేటర్ ఆబిద్ అలీ, సీసీవో మహేశ్, ఆర్పీలు, ఉపాధ్యాయులున్నారు.

### వైద్య సిబ్బందిపై డీఎంహెచ్‌వోకు ఫిర్యాదు

కెరమెరి, ఏప్రిల్ 15: మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో సమయపాలన పాటించని వైద్య సిబ్బందిపై శాఖాపరమైన చర్యలు తీసుకోవాలని జాతీయ మానవ హక్కుల కమిటీ జిల్లా చైర్మన్ రాథోడ్ రమేశ్ అన్నారు. మంగళవారం జిల్లా వైద్యారోగ్య శాఖాధికారి డాక్టర్ సీతారాంను ఆసిఫాబాద్ కార్యాలయంలో కలిసి వినతి పత్రం అందజేశారు. ఆదివారం వైద్యం కోసం రోగులు దవాఖానకు వెళ్తే వైద్య సిబ్బంది విధులపై నిర్లక్ష్యం వహిస్తూ తలుపులు వేసి ఉంచారని ఆయన ఆరోపించారు. దీంతో కెరమెరి వైద్యాధికారితోపాటు దవాఖాన సిబ్బందిపై తక్షణమే చర్యలు తీసుకోవాలని, ఇలాంటి సంఘటనలు పునరావృతం కాకుండా చర్యలు చేపట్టాలని కోరారు. ఇక్కడ వైస్ చైర్మన్ నైతం మోహన్, జాయింట్ సెక్రెటరీ నైతం భానుచందర్, జిల్లా సోషల్‌మీడియా కన్వీనర్ మహేశ్ ఉన్నారు.

### దేశ వ్యాప్త సమ్మెను జయప్రదం చేయాలి

ఆసిఫాబాద్ టౌన్, ఏప్రిల్ 15: కేంద్ర ప్రభుత్వ కార్మిక, కర్షక వ్యతిరేక విధానాలకు నిరసనగా మే 20న తలపెట్టిన దేశవ్యాప్త సమ్మెను జయప్రదం చేయాలని ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి బోగే ఉపేందర్ పిలుపునిచ్చారు. మంగళవారం ఏఐటీయూసీ జిల్లా అధ్యక్షుడు దివాకర్ గౌడ్, సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎం శ్రీనివాస్, ఐఎన్‌టీయూసీ జిల్లా అధ్యక్షుడు అల్లూరి లోకేశ్, జిల్లా కార్యదర్శి గోగల్ల తిరుపతితో కలిసి సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, కేంద్ర ప్రభుత్వం ఏర్పాటు చేసిన నాలుగు లేబర్ కోడ్స్‌ను వెంటనే రద్దు చేయాలని డిమాండ్ చేశారు. కార్మిక చట్టాలను యథావిధిగా అమలు చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఏఐటీయూసీ జిల్లా ఉపాధ్యక్షుడు పిడుగు శంకర్, ఆర్టీసీ రిటైర్డ్ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షుడు మల్లేశం, నాయకులు శంకర్ తదితరులు పాల్గొన్నారు.

### బూరెపల్లి, కోర్సినిలకు బస్సు పునః ప్రారంభం

చింతలమానేపల్లి, ఏప్రిల్ 15 : మండలంలోని బాబాపూర్ మీదుగా బూరెపల్లి, కోర్సిని గ్రామాలకు వెళ్లే ఆర్టీసీ బస్సును మంగళవారం పునః ప్రారంభించారు. గతంలో ఈ గ్రామాలకు బస్సు సౌకర్యం ఉండగా ఆర్టీసీ అధికారులు సేవలు నిలిపివేశారు. దీంతో బాబాపూర్ గ్రామానికి చెందిన పలువురు ఆసిఫాబాద్ డిపో ఎండీ రాజశేఖర్‌కు బస్సు సౌకర్యం కల్పించాలని కోరుతూ వినతిపత్రం అందజేశారు. దీంతో ఆర్టీసీ అధికారులు బస్సును పునః ప్రారంభించారు. బాబాపూర్ గ్రామంలో చింతలమానేపల్లి ఎస్ఐ ఇస్లావత్ నరేశ్, గ్రామస్తులతో కలిసి కొబ్బరికాయ కొట్టి బస్సు సేవలు ప్రారంభించారు.

### 21న శ్రీకేశవనాథ స్వామి భూముల కౌలుకు వేలం

ఆసిఫాబాద్ టౌన్, ఏప్రిల్ 15 : జిల్లా కేంద్రంలోని శ్రీ కేశవానథ స్వామి అలయానికి సంబంధించిన దాదాపు 87 ఎకరాల సాగు భూమి ఒక సంవత్సరం పాటు కౌలు చేసుకునేందుకు ఈ నెల 21న బహిరంగ వేలం నిర్వహిస్తున్నట్లు అలయ ఈవో వేణుగోపాల్ గుప్తా మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. జన్కపూర్, గుండి శివారులో ఉన్నఆలయ భూములకు వేలం నిర్వహిస్తున్నామని పేర్కొన్నారు. ఆసక్తి కలిగిన రైతులు నిర్ణీత ధరావతు సొమ్ము చెల్లించి వేలంలో పాల్గొనాలన్నారు. వివరాలకు 9618307962, 9491344496, 9885489088, 9908867600 నంబర్లలో సంప్రదించాని పేర్కొన్నారు.

### నూతన చేతిపంపు ప్రారంభం

ఆసిఫాబాద్ అంబేద్కర్ చౌక్, ఏప్రిల్ 15 : మండలంలోని రాజురా గ్రామంలోని పోచమ్మ ఆలయం వద్ద భక్తుల సౌకర్యార్థం ఇటీవల ఏర్పాటు చేసిన నూతన చేతి పంపును మాజీ జడ్పీటీసీ అరిగెల నాగేశ్వరరావు మంగళవారం కొబ్బరికాయ కొట్టి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, భక్తుల సౌకర్యార్థం బోరు వేయించామని రానున్న రోజుల్లో గ్రామంలో మరిన్ని అభివృద్ధి కార్యక్రమాలు చేపడతామన్నారు. ఇక్కడ నాయకులు, గ్రామస్తులున్నారు.

### మధ్యాహ్న భోజన సామగ్రి అందజేత

కౌటాల, ఏప్రిల్ 15: మండలంలోని ప్రభుత్వ పాఠశాలలకు జిల్లా విద్యాశాఖ నుంచి మంజూరైన గ్యాస్ పొయ్యి, గంజులు, బకెట్స్, ఇతర మధ్యాహ్న భోజన సామగ్రిని సంబంధిత హెచ్ఎంలకు మండల కేంద్రంలోని ఎంఆర్సీలో ఎంఈవో గావుడే హన్మంతు అందజేశారు. ఇక్కడ మధ్యాహ్న కార్మిక సంఘం మండలాధ్యక్షురాలు శారద, హెచ్ఎంలు, కార్మికులున్నారు.

### ఈవ్ టీజింగ్‌పై నిర్భయంగా ఫిర్యాదు చేయాలి

ఆసిఫాబాద్ టౌన్, ఏప్రిల్ 15:ఈవ్ టీజింగ్‌కు గురైతే నిర్భయంగా ఫిర్యాదు చేయాలని షీ టీం ఎస్ఐ శిరీష అన్నారు. ఎస్పీ డీవీ శ్రీనివాస రావు ఆదేశాల మేరకు అదనపు ఎస్పీ ప్రభాకర్ రావు పర్యవేక్షణలో మంగళవారం ఎస్ఐ వెంకటేశ్వర్లుతో కలిసి స్థానిక శిశుమందిర్ పాఠశాలలో విద్యార్థులకు చట్టాల పై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, మహిళలపై హింస, ఈవ్ టీజింగ్, సైబర్ క్రైమ్‌కు గురైతే వెంటనే షీటీంను సంప్రదించాలని సూచించారు. గుడ్‌టచ్, బ్యాడ్ టచ్ పై వివరించారు. కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపాల్ గుండేటి కోటేశ్వర్ రావు, పాఠశాల సిబ్బంది, షీ టీం సభ్యులు ఈ స్వప్న, శ్రీలత, స్వప్న, రజిని పాల్గొన్నారు.

### కుక్కలదాడిలో చుక్కల దుప్పి మృతి

కాగజ్‌నగర్, ఏప్రిల్ 15: కాగజ్‌నగర్ మండలంలోని ఎన్‌జీవోస్ గ్రామ పంచాయతీలో మంగళవారం కుక్కల దాడిలో చుక్కల దుప్పి మృతి చెందింది. వేకువజామున గ్రామంలో ప్రవేశించిన చుక్కల దుప్పిపై కుక్కలు దాడి చేయడంతో తీవ్రగాయాలైన దుప్పి అక్కడిక్కడే మృతి చెందింది. పశు వైద్యాధికారి విజయ్ మృతి చెందిన దుప్పి పరిశీలించారు. అనంతరం వేంపల్లి అటవీ ప్రాంతంలో మృతి చెందిన దుప్పిని ఖననం చేశారు.

### కాంట్రాక్టు కార్మికులను పర్మినెంట్ చేయాలి

జైపూర్, ఏప్రిల్ 15: ఎస్టీపీపీలో పని చేస్తున్న కాంట్రాక్టు కార్మికులను పర్మినెంట్ చేయాలని హెచ్ఎంఎస్ సెంట్రల్ కమిటీ నాయకులు తిప్పారపు సారయ్య పేర్కొన్నారు. మంగళవారం ఎస్టీపీపీలో పని చేస్తున్న కాంట్రాక్టు కార్మికులతో సమావేశం నిర్వహించి మాట్లాడారు. ఇటీవల యాదాద్రి భువనగిరి జిల్లాలో నిర్వాసితులైన కాంట్రాక్టు కార్మికులను పర్మినెంట్ చేసిన విధంగా ముఖ్యమంత్రి చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. ఇక్కడి ప్రజల గురించి ప్రభుత్వం ఆలోచించి గ్రామాన్ని ఆర్అండ్ఆర్ పరిధిలోకి తీసుకుని అన్ని సదుపాయాలు కల్పించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో కాంట్రాక్టు కార్మికసంఘం నాయకులు విక్రం, సాయిరెడ్డి, సంపత్‌కుమార్, రిక్కుల నరసింహారెడ్డి, అనిల్‌రెడ్డి, నోముల బాలయ్య తదితరులు పాల్గొన్నారు.